సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



సోమశిలలో 55.09 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 55.099 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 32,977 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.79 వేలు
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,160
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,375
నవర (8 గ్రాములు)	రూ.59 వేలు

గరిష్టం/కనిష్టం
32.3 /24.5

వాతావరణం

జిల్లాలో వాతావరణం శుక్రవారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 80 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

ఘనంగా వాల్మీకి జయంతి



నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం కలెక్టర్ ఆనంద్ మాట్లాడారు. ప్రభుత్వ వసతి గృహాలను అభివృద్ధి చేసేందుకు బీసీ సంక్షేమ శాఖ ద్వారా కృషి చేస్తామని వివరించారు. రామాయణ శ్లోకాలను బీసీ నేత చల్లా వెంకటసుబ్బయ్య ఆలపించారు. డీఆర్వో లవన్న, వాల్మీకి బోయ సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జెడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి ప్రసూన, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసులు, బూదాటి రాధాకృష్ణయ్య, జనార్దన్, నాగరాజారావు, వెంకటసుబ్బయ్య, హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో రబీ సీజన్లో వరిసాగు చేసే రైతులకు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీపీటీ – 5204, కేఎన్నెమ్ – 1638, ఎన్ఎల్ఆర్ – 34449 రకాల విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు. డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్ తదితర ఎరువులను అందుబాటులో ఉంచామని వివరించారు.

ఎమ్మెస్సెమ్ఈ రుణాలపై అవగాహన రేపు

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని కరెంటాఫీస్ సెంటర్లో గల కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో ఎమ్మెస్సెమ్ఈ రుణాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నామని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీఐఐసీ, డీఐసీతో కలిసి అవగాహన కల్పించనున్నామని, ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు.

పెన్నా పరీవాహక గ్రామాలపై దృష్టి



సమీక్షిస్తున్న రమేష్‌నాయక్

సంగం: పెన్నా పరీవాహక గ్రామాలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి రమేష్‌నాయక్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్నాకు వరదలొచ్చే అవకాశం ఉన్న తరుణంలో అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. వరద ముంపునకు గురయ్యే తొమ్మిది గ్రామాలను గుర్తించి ప్రత్యేకాధికారులను నియమించామని వెల్లడించారు. పొర్లుకట్టలు, చెరువులకు గండ్లు పడకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. తహసీల్దార్ సోమ్లానాయక్, ఇరిగేషన్ ఏఈ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరిపైరు పరిశీలన



చేజర్ల: వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి పైరును జిల్లా వ్యవసాయాధికారులు గురువారం పరిశీలించారు. మండలంలోని కోటితీర్థం, టీకేపాడు గ్రామాల్లో గల పొలాలను పరిశీలించిన అనంతరం ఆత్మ పీడీ శివన్నారాయణ మాట్లాడారు. మొలకలు రాకుండా ఉండేందుకు గానూ 50 గ్రాముల గళ్ల ఉప్పు ద్రావణాన్ని లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో వరినాట్లను త్వరగా వేసేలా చూడాలని కోరారు. కృషి విజ్ఞాన కేంద్ర కోఆర్డినేటర్ శివజ్యోతి, శాస్త్రవేత్త సురేఖ, మండల వ్యవసాయాధికారి శశిధర్, వీఏఏ హసన్ తదితరులు పాల్గొన్నారు.

తాగి.. తూగుతున్నారు



ఎన్నికల వేళ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన హామీలను నేతలు సాధారణంగా ఇస్తుంటారు. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల వేళ టీడీపీ అధినేత చంద్రబాబు సరికొత్త హామీ ఇచ్చి జాతీయ స్థాయిలో వార్తల్లోకెక్కారు. తక్కువ ధరకే మద్యాన్ని అందిస్తామంటూ ఊదరగొట్టి గద్దెనెక్కారు. తదనంతరం నూతన పాలసీకి రూపకల్పన చేసి ప్రైవేట్ వైన్ షాపులను ఏర్పాటు చేయడంతో తక్కువ ధరకే లిక్కర్ లభిస్తుందని మందుబాబులు ఆశగా ఎదురుచూశారు. జోరువానను సైతం లెక్కచేయకుండా దుకాణాల ఎదుట బుధవారం బారులుదీరారు. తీరా లోపలికెళ్లాక ఆ ధరలను చూసి గుడ్లుతేలేయడం వారి వంతైంది.

ఎనీ టైమ్ నిషా

- బెల్టు షాపులకు అనధికార వేలం
- తమ్ముళ్లదే నిర్వహణ
- అందులోనూ వాటాలడుగుతున్న షాడో ఎమ్మెల్యేలు
- తొలి రోజు నుంచే ఎమ్మార్పీ ఉల్లంఘన
- జిల్లాలో సిండికేట్ మాయ..!

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నూతన మద్యం పాలసీతో ప్రభుత్వ ఖజానాకు లాభం మాట అటుంచితే.. ఈ వ్యాపారం అధికార పార్టీ ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలకు భలే మంచి బేరంగా మారింది. వ్యాపారులను బెదిరించి.. భయపెట్టి షాపుల్లో వాటాలు దక్కించుకున్న షాడో ఎమ్మెల్యేల కన్ను తాజాగా బెల్టు షాపులపై పడింది. వీటి నిర్వహణకు అనధికారికంగా వేలాన్ని పెట్టి తమ్ముళ్ల వద్దే గుంజుకుంటున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 182 మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. వ్యాపారానికి సంబంధించిన ప్రొవిజనల్ లైసెన్స్‌నే అధికారులు ప్రస్తుతం అందజేశారు. తొలి రోజు 100కుపైగా దుకాణాలు ప్రారంభంకాగా, గురువారం రాత్రి నాటికి దాదాపు అన్నింటినీ అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలోని 165 దుకాణాలకు నెల్లూరు సమీపంలోని దేవరపాళెం.. కందుకూరు నియోజకవర్గంలోని 17 షాపులకు ఒంగోలులోని ఐఎమ్మెల్ డిపోల నుంచి లిక్కర్‌ను సరఫరా చేస్తున్నారు.

తొలి రోజు నుంచే అదనంగా వసూలు

ఎమ్మెల్యేల దందాలతో బెంబేలెత్తిన వ్యాపారులు ఎంత వెనుకేసుకుంటే అంత మంచిదనే భావనతో తొలి రోజు నుంచే నిబంధనల ఉల్లంఘన పర్వానికి తెరలేపారు. బాటిల్‌పై ఉన్న ధర కంటే అదనంగా రూ.10 నుంచి రూ.15 వరకు వసూలు చేస్తున్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేసిన 30 దుకాణాల వారు సిండికేట్‌గా మారడంతో ప్రతి షాపులోనూ ఇదే తంతు నడుస్తోంది. నగరంలోని రెండు షాపుల్లో మద్యం ధరలను పరిశీలించగా, ఇదే అంశం స్పష్టమైంది. మరోవైపు నెల్లూరు నగరంలోని లిక్కర్ షాపుల వద్దే బహిరంగంగా మద్యాన్ని సేవిస్తున్నారు.

రండీ.. రారండీ..!

వాస్తవానికి ప్రభుత్వ నిబంధనల మేరకు ఉదయం పది నుంచి రాత్రి పది గంటల వరకే మద్యాన్ని విక్రయించాలి. అయితే ఆత్మకూరులో ఉదయం 8.40కే దుకాణాలు తెరుచుకున్నాయి. కొన్ని చోట్ల ఉదయం తొమ్మిది నుంచే విక్రయాలు సాగిస్తున్నారు. ఈ తతంగం జరుగుతున్నా, మామూళ్లే ముఖ్యమనే రీతిలో ఎక్సైజ్ అధికారులు వ్యవహరిస్తున్నారు.



నెల్లూరులోని జ్యోతినగర్ సమీపంలో గల లిక్కర్ షాపు వద్ద మందుబాబులు

నిరంతర సురాపానం

రాత్రీ, పగలనే తేడా లేకుండా, సురాపానాన్ని ప్రోత్సహించి.. ధనార్జనే లక్ష్యంగా జిల్లాలో బెల్టు దుకాణాల ఏర్పాటుకు మద్యం సిండికేట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీని కోసం ఆయా నిర్వాహకులు షాడోలకు నగదును సమర్పించాల్సి వస్తోంది. స్థానిక ఎమ్మెల్యేల ముఖ్య అనుచరుల ద్వారా వసూలు చేస్తున్నారు. తాము సూచించిన వారికే కేటాయించేలా సిండికేట్‌కు ఆదేశాలూ అందుతున్నాయి. రాత్రి, ఉదయం షాపు తెరిచేంత వరకు మద్యం విక్రయాలు జరిపేందుకు వీలుగా కేసులను సరఫరా చేస్తారు. ఆ సమయాల్లో ప్రతి క్వార్టర్‌పై రూ.50 అదనంగా వసూలు చేసే వెసులుబాటును కల్పించారు.

'బెల్టు'కు వేలం

బెల్టు దుకాణాల నిర్వహణ కోసం వేలాన్ని నిర్వహించారనే టాక్ నడుస్తోంది. ఆత్మకూరులో ఏకంగా రూ.10 లక్షల వరకు పలికిందని సమాచారం. ఇది కేవలం షాపులున్న చోట మాత్రమే. గ్రామాల్లో బెల్టు నిర్వహణకు కప్పం చెల్లించాల్సి ఉంటుంది. కావలి, కందుకూరు, ఉదయగిరి, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో బెల్టు కోసం వేలం ప్రక్రియను సాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గొడవ చేశారా.. తన్నులే..!

మద్యాన్ని రూ.99కే అందిస్తామనే విధాన నిర్ణయం ఎక్కడా అమలు కాలేదు. ఎమ్మార్పీ కంటే అదనంగా వసూలు చేయడంపై మందుబాబులు మండిపడుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే సేల్స్‌మేన్లు నోరుపారేసుకుంటున్నారు. మద్యం దుకాణాల వద్ద రౌడీమూకలను పెంచి పోషిస్తూ.. ఎవరైనా గొడవపడితే వారిని చితకబాదేందుకూ సన్నద్ధమవుతున్నారు.



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు సందానీ. నెల్లూరు రూరల్ పరిధిలోని జ్యోతినగర్ వద్ద ఏర్పాటు చేసిన వైన్ షాపులో క్వార్టర్‌ను కొనుగోలు చేశారు. దీని ఖరీదు రూ.130 కాగా, అదనంగా పది రూపాయలు వసూలు చేశారు. ఇదేం ఖర్మ సార్ మాకు.. తక్కువ ధరకే మద్యం లభిస్తుందని ఆశపడి టీడీపీకి ఓటేస్తే ఇలా మోసం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

మాపై ఎందుకీ కక్ష..?

జనావాసాల మధ్య మద్యం దుకాణాలా..

- ఇదేనా ప్రభుత్వం కల్పించే రక్షణ..?
- నిరసనలతో హోరెత్తించిన మహిళలు
- గడిచిన ఐదేళ్లు ప్రశాంతంగా ఉన్నాం

గడిచిన ఐదేళ్లు ప్రశాంతంగా జీవించిన తమపై ప్రభుత్వం ఎందుకింత కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మహిళలు ప్రశ్నిస్తున్నారు. నూతన మద్యం పాలసీ అమల్లో భాగంగా జనావాసాల మధ్య వైన్ షాపులను ఏర్పాటు చేసి తమకు రక్షణ లేకుండా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వీటి ఏర్పాటును అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేసి ఆయా ప్రాంతాల్లో నిరసనలు చేపడుతున్నారు.



ఇళ్ల మధ్య వద్దే వద్దు

పొదలకూరు: జనావాసాల మధ్య మద్యం షాపును ఏర్పాటు చేయొద్దని, దీని వల్ల బయట తిరగాలంటే తమకు ఇబ్బందులు తలెత్తుతాయంటూ పొదలకూరులోని రామ్‌నగర్ గేట్ సెంటర్ వద్ద మహిళలు గురువారం ధర్నా చేపట్టారు. మద్యం షాపునకు వెళ్లే దారి ముందు టెంట్ ఏర్పాటు చేసి బైఠాయించారు. ఇళ్ల మధ్య వద్దు.. ఊరి బయటే పెట్టండంటూ నినాదాలు చేశారు. అదే మార్గంలో వెళ్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కారును ఆపి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మహిళలు మాట్లాడారు. 2014 – 19 మధ్య ఇక్కడ ఏర్పాటు చేస్తే తామంతా ఏకమై దూరంగా పంపామని గుర్తుచేశారు. తాజాగా మరోసారి జనావాసాల మధ్యలో ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. రామ్‌నగర్ గేట్ సెంటర్లో విద్యాసంస్థలు, దేవాలయాలున్నాయని తెలిపారు. కాగా మద్యం దుకాణంతో ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడతామని ఎస్సై హనీఫ్ నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. మరోవైపు నిర్వాహకుడు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా షాపును తెరిచి విక్రయాలను సాగించారు.

స్థల పరిశీలన అడ్డగింత



ఉదయగిరి: ఉదయగిరిలో జనావాసాల మధ్య మద్యం షాపులను ఏర్పాటు చేయొద్దంటూ పట్టణవాసులు ఆందోళన చేపట్టారు. షాపులను ఏర్పాటు చేసేందుకు యూనియన్ బ్యాంక్ రోడ్డులో స్థల పరిశీలన చేస్తుండగా, స్థానికులు అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో నెలకొల్పితే మహిళలు ఇబ్బంది పడే అవకాశం ఉందని, వేరే చోట పెట్టుకోవాలని తేల్చిచెప్పారు. దీంతో వారు వెనుదిరిగారు.

షాపును తొలగించాల్సిందే..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నివాసాల మధ్య మద్యం షాపును తొలగించాలంటూ బుచ్చిరెడ్డిపాళెంలో మహిళలు నిరసన చేపట్టారు. పట్టణంలోని ముంబై జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న శాంతినగర్ వద్ద వైన్ షాపును ప్రభుత్వం కేటాయించింది. విషయం తెలుసుకున్న స్థానిక మహిళలు అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. తమ ప్రాంతంలో షాపును తొలగించాలని డిమాండ్ చేశారు. మద్యం సేవించి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.



నరుకూరు సెంటర్లో సీఐటీయూ, సీపీఎం నేతల నిరసన

ఏర్పాటును అనుమతించబోం

తోటపల్లిగూడూరు: నరుకూరు సెంటర్లో ఎలాంటి మద్యం దుకాణ ఏర్పాటును అనుమతించబోమని సీఐటీయూ జిల్లా నేత మారుబోయిన రాజా స్పష్టం చేశారు. నరుకూరు సెంటర్లోని మద్యం షాపు ఎదుట నిరసనను సీపీఎం నేతలు, కార్యకర్తలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైన్ షాపును ఇక్కడ ఏర్పాటు చేస్తే ప్రజలతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నెల్లూరు రూరల్ ప్రాంతానికి చెందిన కొందరు వ్యాపారాలు నరుకూరు సెంటర్లో మద్యం దుకాణాన్ని ప్రారంభించేందుకు యత్నాలు చేస్తున్నారని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేదిలేదని చెప్పారు.

పారని తమ్ముళ్ల పాచిక

- ఇసుక దోపిడీకి చివరి వరకు పాకులాట
- ఒత్తిడి తెచ్చినా.. నో ఛాన్స్
- లాటరీతో చెక్ పెట్టిన అధికారులు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని ఇసుక రీచ్‌లలో దోపిడీకి అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అనుచరులు వేసిన స్కెచ్ పారలేదు. అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి.. బిడ్లను తామే దక్కించుకునేందుకు విఫలయత్నం చేశారు. చివరికి ఓపెన్ టెండర్లలో కాకుండా లాటరీ పద్ధతిన తీయడంతో అప్పటి వరకు ఆశతో ఉన్న వారు ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు.

ఉదయం నుంచే తిష్ట

జిల్లాలోని అధికార పార్టీ నేతలు కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఉదయం నుంచే తిష్ట వేశారు. తాను అనుకుంది దక్కకపోవడంతో నైరాశ్యంలో కూరుకుపోయారు. లాటరీ ద్వారా దక్కించుకున్న వారిపై ఒత్తిడి తీసుకొస్తారానని సందేహాలూ తలెత్తుతున్నాయి.

నాలుగు రీచ్‌లకు టెండర్లు

వాస్తవానికి జిల్లాలోని నాలుగు రీచ్‌ల నుంచి ఇసుకను తీసుకొచ్చి డంపింగ్ యార్డుల్లో నిల్వ చేయాలి. అక్కడి నుంచి సరఫరా చేసే వాహనాలకు లోడింగ్ చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి జిల్లాలోని పడమటి కంభంపాడు, పల్లిపాడు, మినగల్లు, విరువూరులోని రీచ్‌లకు టెండర్లను ఈ నెల ఆరు నుంచి 16 వరకు ఆహ్వానించారు. 43 దాఖలు కాగా, జీఎస్టీ లేదనే కారణంతో ఓ టెండర్‌ను తిరస్కరించారు.



లాటరీ తీస్తున్న జేసీ కార్తీక్

తలలు పట్టుకున్న అధికారులు

రీచ్‌లకు సంబంధించిన టెండర్లను ఓపెన్ చేయాలని తొలుత నిర్ణయించారు. అయితే ఏ విధంగా ఎంపిక చేయాలనే అంశం మైనింగ్ అధికారులకు అర్థం కాక జాప్యం జరిగింది. టెండర్లు దాఖలు చేసిన వారు కొన్ని సమస్యలను లేవనెత్తారు. దీంతో మైనింగ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ అధికారులు తలలుపట్టుకున్నారు. ఈలోపు అధికార పార్టీకి చెందిన పలువురు నేతలు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ పరిణామాల క్రమంలో ఉదయం 10.30కు ప్రారంభమైన ప్రక్రియ రాత్రి ఎనిమిది వరకు కొనసాగింది.

కలగజేసుకున్న ఉన్నతాధికారులు

టన్నును రూ.114.90కు ప్రభుత్వం నిర్వహించగా, టెండర్లలో రూ.36 నుంచి రూ.120 వరకు కోట్ చేసిన అంశాన్ని గుర్తించారు. చాలా వాటికి కొంత మంది ఒకే తరహాలో టెండర్లు వేయడం అధికారులకు తలనొప్పిగా మారింది. దీంతో ఉన్నతాధికారులు కలగజేసుకొని లాటరీ పద్ధతి ద్వారా నిర్వహించారు.

జేసీ ఆధ్వర్యంలో లాటరీ

జిల్లాలోని నాలుగు రీచ్‌లకు సంబంధించిన లాటరీ ప్రక్రియను జేసీ కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. లాటరీలో మొదట నిలిచిన వారికే అవకాశం ఉంటుందని, వారు చేయలేని పక్షంలో రిజర్వ్‌లో ఉన్న వారికి లభిస్తుందని ఆయన చెప్పారు.

రీచ్	దక్కించుకున్న వారు	రిజర్వ్
పల్లిపాడు	గోదావరి కృష్ణ వాటర్ ఫ్యూస్	భరణికుమార్, మనస్విని ఇన్‌ఫ్రా
మినగల్లు	నాగేంద్ర ఇన్‌ఫ్రా	ఎస్సార్కే ఎంటర్‌ప్రైజెస్, నాగేంద్ర
విరువూరు	శ్రీలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్	నరసింహారెడ్డి, విజయన్ గ్రావెల్స్
పడమటి కంభంపాడు	రాజ్యలక్ష్మి శాండ్ ఇండస్ట్రీస్	కేకేఆర్ మినరల్స్, లోహిత ఎంటర్‌ప్రైజెస్

సామాన్యుడికి అందుబాటులో ఇసుక



మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు(దర్గామిట్ట): సామాన్యుడికి ఇసుక అందుబాటులో ఉండేలా సీఎం చంద్రబాబు దృష్టి సారిస్తున్నారని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో నిర్వహిస్తున్న ఇసుక టెండర్ల విధానాన్ని కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోమ వారం నుంచి ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉన్నాం



మాట్లాడుతున్న పావని

ఆత్మకూరు: సోమశిల జలాశయానికి అధిక ఇన్‌ఫ్లో వస్తే, దిగువకు విడుదల చేయడం తదితరాలపై అప్రమత్తంగా ఉన్నామని ఆత్మకూరు ఆర్డీఓ పావని పేర్కొన్నారు. ఈ మేరకు తన కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆమె మాట్లాడారు. సోమశిల జలాశయంలో ప్రస్తుతం 54 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఎగువ నుంచి 25 వేల క్యూసెక్కులు కంటే అధిక ప్రవాహం రానుందనే సమాచారం ఉందని చెప్పారు. నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే, పెన్నా పరీవాహక గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, తగు జాగ్రత్తలు చేపట్టేలా ఆయా మండలాల తహసీల్దార్లను ఆదేశించామని తెలిపారు. కండలేరు, ఉత్తర, దక్షిణ కాలువలకు ఆరు వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నామన్నారు.

జలకళ

భారీ వర్షాలతో జిల్లాలోని చెరువులు, కాలువలు, వాగులు జలకళ సంతరించుకున్నాయి. మొన్నటి వరకు ఎండిపోయి దర్శనమిచ్చిన కొన్ని చెరువులు నేడు నిండుకుండలా మారాయి. కొన్నింట్లో ఇంకా నీరు చేరుతోంది. చాలా మండలాల్లో కలుజులు పారుతున్నాయి. సోమశిల జలాశయం నుంచి దిగువకు వరద నీరు విడుదల చేశారు. దీంతో నెల్లూరు పెన్నా బ్యారేజీకి జలాలు చేరుతున్నాయి. కాగా పలుచోట్ల వాగులు పొంగడంతో ఇప్పటికీ రాకపోకలు స్తంభించాయి. – సాక్షి నెట్‌వర్క్




నెల్లూరు పెన్నా బ్యారేజీ వద్ద వరద నీరు



పొదలకూరు: కలుజు పారుతున్న కల్యాణపురం చెరువు



వరికుంటపాడు: నక్కల గండికి చేరిన వర్షపునీరు



సీతారామపురం: జలకళ సంతరించుకున్న మర్రిపూట్ల రిజర్వాయర్



చేజర్ల: నల్లవాగుపై స్తంభించిన రాకపోకలు

క్లుప్తంగా

కూలిన ఇంటి పైకప్పు.. తప్పిన ప్రాణాపాయం



కూలిన పెంకుటింటి పైకప్పు

ఉదయగిరి: భారీ వర్షాలకు పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలో ఓ పెంకుటిల్లు పైకప్పు కూలింది. వివరాలిలా ఉన్నాయి. షేక్ షాహీదా తన కుటుంబసభ్యులతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా గురువారం తెల్లవారుజామున ఒక్కసారిగా ఇంటి పైకప్పు కూలింది. అదృష్టవశాత్తు ఎవరూ గాయపడలేదు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే తనను ప్రభుత్వం ఆదుకోవాలని, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని ఆమె కోరుతోంది.

తండ్రి, కుమార్తె అదృశ్యం



కిషన్



జాస్మిన్

ఉలవపాడు: బజారుకు వెళ్లిన తండ్రి, కుమార్తె వారం రోజుల నుంచి కనిపించడం లేదనే ఫిర్యాదుపై ఉలవపాడు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. రామాయపట్నం గ్రామానికి చెందిన బిల్లా కిషన్, అతని ఆరు సంవత్సరాల కుమార్తె ఆనంది జాస్మిన్‌ను తీసుకుని ఈనెల 11వ తేదీన ఇంటి నుంచి బజారుకు వెళ్లాడు. ఇక తిరిగి రాలేదు. కిషన్ భార్య మౌనిక చుట్టుపక్కల గ్రామాల్లో బంధువుల ద్వారా వెతికించింది. అయినా ఆచూకీ దొరక్కపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అంకమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

లింగసముద్రం: పక్కింటికి విద్యుత్ సరఫరా కాకపోవడంతో సర్వీస్ తీగలను పరిశీలిస్తుండగా షాక్‌కు గురై ఎలిపాటి శ్రీను (48) అనే వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని వెంగళాపురం గ్రామంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన శ్రీను కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, పిల్లలున్నారు. గురువారం పక్కింటికి విద్యుత్ సరఫరా కాకపోవడంతో శ్రీను వెళ్లి కరెంట్ స్తంభం నుంచి వస్తున్న సర్వీస్ తీగలను పరిశీస్తుండగా షాక్‌కు గురయ్యాడు. అక్కడున్నవారు కర్రతో తీగలను పక్కకు లాగారు. అప్పటికే శ్రీను స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు, బంధువులు అతడిని ప్రైవేట్ వాహనంలో కందుకూరుకు తీసుకెళ్తుండగా పోకూరు వద్ద మృతిచెందాడు. ఇంటి పెద్ద చనిపోవడంతో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

ఇరిగేషన్ శాఖలో బదిలీలు

• ఎస్‌ఈగా దేశ్‌నాయక్



దేశ్‌నాయక్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జల వనరుల శాఖ జిల్లా ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా కావలి డ్రెయినేజీ డివిజన్ ఈఈగా పనిచేస్తున్న ఎస్.దేశ్‌నాయక్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎస్‌ఈగా ఉన్న కావలి ఈఈ కృష్ణమోహన్‌ను లింగంగుంట్లకు బదిలీ చేశారు. కావలి ఇరిగేషన్ సబ్ డివిజన్ డీఈఈగా పనిచేస్తున్న ముజాహిద్ ఖాన్ కావలి ఎన్ఎన్ డివిజన్ ఇన్‌చార్జి ఈఈగా నియమితులయ్యారు. సోమశిల స్వర్ణముఖి లింక్ కెనాల్ సబ్ డివిజన్ మూడో కండలేరు డ్యామ్ డీఈఈగా పనిచేస్తున్న కె.సుబ్రహ్మణ్యేశ్వరరావును ప్రాజెక్ట్ సబ్ డివిజన్ 2 ఇన్‌చార్జి ఈఈగా బదిలీ చేశారు.

'డీఏపీ సరఫరా లేదు'

మర్రిపాడు: 2024–25 పంట కాలానికి సంబంధించి పొగాకు రైతులకు పొగాకు బోర్డు డీఏపీ ఎరువును సరఫరా చేయడం లేదని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మోనియం సల్ఫేట్, పొటాష్ ఎరువులను మాత్రమే పంపిణీ చేస్తోందన్నారు. డీఏపీ అవసరమైన రైతులు బయట కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్

దుత్తలూరు: ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే శనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో అన్నదాతలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్.వెంకటసుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జేజీ–11 విత్తనాలను 25 శాతం సబ్సిడీపై క్వింటా రూ.7,050, కాక్–2 విత్తనాలను 25 శాతం సబ్సిడీపై క్వింటా రూ.9,075కు అందజేస్తున్నట్లు వివరించారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, దరఖాస్తు పత్రం, మొబైల్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 30లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సొసైటీల్లో ఎరువులు అందుబాటులో ఉంచుతున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్ జగన్‌ను కలిసిన విజయకుమార్‌రెడ్డి



జగన్‌మోహన్‌రెడ్డితో విజయకుమార్‌రెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలో ఆ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి కలిశారు. జగన్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆనం వెంట పార్టీ రూరల్ మండలాధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

రాళ్లపాడులో పెరిగిన నీటిమట్టం



ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్ట్ నీటిమట్టం గురువారం సాయంత్రానికి 14.1 అడుగులకు చేరినట్లు జేఈ చంద్రమౌళి చెప్పారు. నాలుగు రోజుల క్రితం 8 అడుగుల మేర నీరుండగా తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు 14.1 అడుగులకు చేరినట్లు తెలిపారు. బుధవారం నుంచి ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో వరద నీరు తక్కువగా వస్తున్నట్లు వెల్లడించారు. మన్నేరు, పిల్లాపేరు, ఉప్పుటేరుల నుంచి 430 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రాజెక్ట్‌కు వస్తోందన్నారు. సోమశిల జలాశయం ఉత్తర కాలువకు నీరు ఆపివేయడంతో ఆ జలాలు ఆగిపోయాయని, ఉప్పుటేరుకు వచ్చిన వరదనీరు మాత్రమే కొద్దిమేర వస్తున్నట్లు చెప్పారు.

పోల్‌వాల్ట్‌లో ప్రతిభ చూపి..



పోల్‌వాల్ట్ పోటీలో నిఖిల్

• సౌతిండియా పోటీలకు జిల్లా వాసి

అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తా



క్రీడల పట్ల ఉన్న ఆసక్తి నన్ను ఇంత దూరం తీసుకొచ్చింది. దాతల ప్రోత్సాహం, కోచ్ రజినీకాంత్, మా కరస్పాండెంట్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ప్రోత్సాహంతో పోల్‌వాల్ట్‌లో రాణిస్తున్నాను. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనేదే నా లక్ష్యం. – నిఖిల్, క్రీడాకారుడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పోల్‌వాల్ట్‌లో ప్రతిభ చూపుతూ జాతీయ స్థాయి పోటీలకు ఎదిగాడు నిఖిల్ అనే యువ క్రీడాకారుడు. దగదర్తి మండలానికి చెందిన వడ్డినేని నిఖిల్ పోల్‌వాల్ట్ సౌతిండియా చాంపియన్‌షిప్ పోటీలకు నెల్లూరు నుంచి ఎంపికయ్యాడు. ఇతని తల్లిదండ్రులైన రామానాయుడు, వెంకటరమణమ్మలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నిఖిల్ దగదర్తిలో హైస్కూల్ విద్యను అభ్యసించాడు. ఆ సమయంలో క్రీడల పట్ల ఆసక్తి ఉండేది. సాఫ్ట్‌బాల్, అథ్లెటిక్స్‌లో సాధన చేస్తూ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. ఉన్నత విద్య నిమిత్తం నెల్లూరుకు చేరాడు. కృష్ణచైతన్య కళాశాలలో డిగ్రీలో చేరాడు. ప్రస్తుతం రెండో సంవత్సరం బీసీఏ చదువుతున్నాడు. ఓ వైపు కాలేజీకి వెళ్తూనే నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అథ్లెటిక్స్ కోచ్ రజినీకాంత్ ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగిస్తున్నాడు. పోల్‌వాల్ట్‌తోపాటు పరుగు పందేలు, జంప్స్ పోటీల్లో నిఖిల్ ప్రతిభ చూపాడు. తాజాగా సౌత్‌జోన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. పోల్‌వాల్ట్ క్రీడా పరికరాలు ఎంతో ఖరీదైనవి. దీంతో దగదర్తి గ్రామానికి చెందిన ఎం.రవీంద్రనాయుడు రూ.40 వేలిచ్చి నిఖిల్‌ను ప్రోత్సహించారు. త్వరలో గుంటూరులో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో నిఖిల్ ఉత్తమ ఫలితాలను అందిస్తాడని కోచ్ రజినీకాంత్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పెన్నా పరీవాహక ప్రాంతాల పరిశీలన



అప్పారావుపాళెం పెన్నా పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ తదితరులు

ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాళెం సమీపంలో ఉన్న పెన్నా పరీవాహక ప్రాంతాన్ని గురువారం ఆత్మకూరు మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు అధికారులతో కలిసి క్షేత్ర పరిశీలన చేశారు. అనంతరం ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలోని పెన్నానది పరీవాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సోమశిల జలాశయం నుంచి పెద్దఎత్తున నీటి విడుదల జరిగితే గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించి సహాయక చర్యలను పర్యవేక్షించాలన్నారు. ఎంపీడీఓ, ఇతర అధికారులు మరో బృందంగా ఏర్పడి గ్రామాల్లో పరిశుభ్రమైన తాగునీరు అందించాలని, వర్షాలు తగ్గిన తర్వాత నివాసిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా అప్పారావుపాళెం పునరావాస కేంద్రంలో బాధితులకు భోజనం, తాగునీరు, చిన్నపిల్లలకు పాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి రమణయ్య, ఎంపీడీఓ బజాక్ ప్రవీణ్, తహసీల్దార్ సుధీర్, ఇరిగేషన్ ఏఈ రాజేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్, ఎన్ఆర్‌జీఎస్ ఏపీఓ శిరీషారెడ్డి, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులూ.. తప్పుడు ప్రచారం చేయొద్దు



మాట్లాడుతున్న లబ్ధిదారులు

వెంకటాచలం: మండలంలోని వెంకటాచలం జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లపై టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేయడం తగదని పలువురు గిరిజన లబ్ధిదారులు హితవు పలికారు. వారు గురువారం ఉదయం విలేకరులతో మాట్లాడారు. జగనన్న ప్రభుత్వంలో అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించారన్నారు. అంతే కాకుండా ఇళ్లు కూడా కట్టించి ఇవ్వడంతో సొంతింటి కల నెరవేరి సంతోషంగా జీవిస్తున్నామని చెప్పారు. కాలనీలో గిరిజనుల ఇళ్లను వైఎస్సార్‌సీపీ నాయకులు నాసిరకంగా నిర్మించి దోచుకున్నారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారని, అయితే ఇందులో వాస్తవం లేదన్నారు. తమకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిర్మాణాలు పూర్తి చేయించారని, ఆ గృహాల్లోనే తాము ఉంటున్నామని చెప్పారు. టీడీపీ నేతలు తప్పుడు ప్రచారాలు మానుకుని చేతనైతే కాలనీలో మరిన్ని అభివృద్ధి పనులు చేయాలని కోరారు. 2014 సంవత్సరం నుంచి సొంతిళ్లు లేకుండా చెట్ల కింద గుడిసెల్లో మగ్గామని, 2019 వరకు ఎన్ని అర్జీలిచ్చినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే తొలుత ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. తమకు గూడు కల్పించిన వారిపై తప్పుడు ప్రచారాలు చేయడం మంచిది కాదన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 140
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 250
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 276
లేయర్ చికెన్	: 204

పాపం అన్నదాతలు



నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న రైతులు

సోమశిల: ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటలు వర్షం కారణంగా దెబ్బతినడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. మూడురోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వానలతో అనేకమంది రైతులు పంటలు నష్టపోయారు. అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లిలో సుమారు వంద ఎకరాల్లో పంట ముంపునకు గురైందని రైతులు గురువారం వాపోయారు. మండల వ్యాప్తంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వానకు వరి దెబ్బతింది. చేతికొచ్చే దశలో ఉన్న పంట కళ్లెదుటే నేలపాలవుతుండడంతో రైతన్నలు తీవ్ర వేదనకు గురవుతున్నారు. గురువారం మధ్యాహ్నం నుంచి వర్షం ఆగడంతో కొంత ఊపిరి పీల్చుకున్నా ఇంకా ఆకాశం మేఘావృతమై ఉండడంతో భయాందోళనకు గురవుతున్నారు. మరో రెండు, మూడు రోజులు వర్షం కురిస్తే పంటలపై ఆశలు వదులుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంపునకు గురై మొలకలు వచ్చిన వరి పంటను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.60
సన్నవి : రూ.30
పండ్లు : రూ.20

మార్చిలోగా గృహ నిర్మాణాలను పూర్తి చేయండి

• హౌసింగ్ పీడీ వేణుగోపాల్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ

సోమశిల: ప్రభుత్వ సహకారంతో లేఅవుట్లలో వచ్చే మార్చిలోగా గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ వేణుగోపాల్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని రేవూరు, దేవరాయపల్లి బిట్ – 1, అనంతసాగరంలోని లేఅవుట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్లాబ్ లెవల్ పూర్తయిన వారు డిసెంబర్ నెలాఖరులోగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. మిగిలిన దశల్లో ఉంటే మార్చిలోగా పనులు చేసుకోవాలన్నారు. అనంతరం బిల్లుల చెల్లింపులు నిలిచిపోతాయన్నారు. ఈ సందర్భంగా పలువురు శ్లాబ్ వరకు నిర్మాణాలు చేసుకున్నామని, విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయించాలని పీడీ దృష్టికి తీసుకురావడంతో వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. పొదుపు సంఘాల ద్వారా రుణాలతోపాటు ఉపాధి హామీ ద్వారా 90 రోజుల వేతనాలు అందిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ శరత్, ఏపీఓ దయాసాగర్ ఉన్నారు.